
మల్లేపల్లిలో ఓటు వేసేందుకు లైన్లో నించున్న ఓటర్లు (ఫైల్)


ఖమ్మం రూరల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)


నాయకన్‌గూడెంలో ఓటు వేసిన యువత (ఫైల్)


# పాలేరు ఓటర్ సో గ్రేట్ !

- నియోజకవర్గంలో పోలింగ్‌శాతం 90.91
- నేలకొండపల్లి మండలంలో అత్యధికంగా 92.85 శాతం
- రేగులతండా పోలింగ్ కేంద్రంలో 174 ఓట్లకు 173 ఓట్లు పోల్
- మూడొంతుల కేంద్రాల్లో 85 శాతానికి కంటే ఎక్కువ ఓట్లు నమోదు..
- 'ప్రజాస్వామ్య' చైతన్యాన్ని చాటిన నియోజకవర్గ ఓటర్లు

**మండలాల వారీగా పోలింగ్ శాతం**

| మండలం | పోలింగ్‌శాతం |
|---|---|
| నేలకొండపల్లి | 92.85 |
| తిరుమలాయపాలెం | 92.76 |
| ఖమ్మం రూరల్ | 88.84 |
| కూసుమంచి | 92.65 |

కూసుమంచి, డిసెంబర్ 2: జిల్లాలోని పాలేరు నియోజకవర్గ ఓటర్లు అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదు చేశారు. ఓటు హక్కుపై తమ చైతన్యాన్ని చాటారు. నియోజకవర్గంలో పోలింగ్‌శాతం 90.91గా నమోదైంది. అలాగే అత్యధికంగా నేలకొండపల్లి మండలంలో పోలింగ్ శాతం 92.85గా నమోదైంది. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని రేగుల తండా పోలింగ్ కేంద్రంలో 174 మంది ఓటర్లు ఉండగా 173 మంది ఓటు వేయడం విశేషం. జిల్లాలో ఇది ఒక రికార్డు. నియోజకవర్గవ్యాప్తంగా 289 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రంలోనూ 70 శాతం కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పాలేరు ఓటర్లే జిల్లాలో అత్యధికంగా పోలింగ్‌శాతం నమోదు చేయడం విశేషం.









**తిరుమలాయపాలెం మండలంలో..**

తిరుమలాయపాలెం మండలంలో 1- 64 వరకు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 49,609 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 24,159 మంది. మహిళలు 25,444 మంది. వీరిలో 46,007 మంది ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 22,721 మంది. మహిళలు 23,286 మంది. పోలింగ్ శాతం 92.76 నమోదైంది. 55 పోలింగ్ కేంద్రాల్లో 85 శాతానికిపైన ఓట్లు పోల్ అయ్యాయి.

**ఖమ్మం రూరల్ మండలంలో..**

ఖమ్మం రూరల్ మండలంలో 65- 163 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ 99 పోలింగ్ కేంద్రాల్లో 88,511 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 42,562 మంది. మహిళలు 45,946. వీరిలో 77,745 మంది ఓటు వేశారు. ఓటు వేసిన వారిలో పురుషులు 37,521 మంది. మహిళలు 40,222 మంది. మండలంలో 88.84 శాతం పోలింగ్ నమోదైంది. 82 పోలింగ్ కేంద్రాల్లో 85 శాతానికి పైగా ఓట్లు పోల్ అయ్యాయి.

**కూసుమంచి మండలంలో..**

కూసుమంచి మండలంలో 164 నుంచి 230 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ 67 పోలింగ్ కేంద్రాల్లో 46,268 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 23,924 మంది. మహిళలు 45,946 మంది. మొత్తం 45,648 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 22,248 మంది. మహిళలు 23,442 మంది. పోలింగ్‌శాతం 92.65 నమోదైంది. 67 పోలింగ్ కేంద్రాల పరిధిలోని 58 పోలింగ్ కేంద్రాల్లో 85 శాతానికి పైగా ఓట్లు పోల్ అయ్యాయి.

**నేలకొండపల్లి మండలంలో..**

నేలకొండపల్లి మండలంలో 231 నుంచి 289 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ 59 పోలింగ్ కేంద్రాల్ల పరిధిలో 48,905 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 23,489 మంది పురుషులు. 25,415 మంది మహిళలు. 45,410 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 21,968 మంది పురుషులు. 23,442 మంది మహిళలు. పోలింగ్‌శాతం 92.85 నమోదైంది. మొత్తం 49 పోలింగ్ కేంద్రాలో 85 శాతం కంటే ఎక్కువ ఓట్లు పోల్ అవడం విశేషం.

**రేగులతండాలో అత్యధికంగా..**

ఖమ్మం రూరల్ మండల పరిధిలోని రేగుల తండా 85వ నెంబర్ పోలింగ్ కేంద్రం పరిధిలో 174 మంది ఓటర్లు ఉండగా 173 మంది ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. అక్కడ పోలింగ్‌శాతం 99.43 నమోదైంది. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో కంటే ఇక్కడి పోలింగ్ కేంద్రంలో నమోదైన పోలింగ్ శాతమే అత్యధికం.


తిరుమలాయపాలెం మండలం బీరోలులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

# నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- ఓట్ల లెక్కింపునకు ఉభయ జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న రాజకీయ పార్టీలు
- తొలివిడతలో భద్రాచలం, వైరా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- సాయంత్రంలోపు పది నియోజకవర్గాల్లో లెక్కింపు ప్రక్రియ పూర్తి
- గెలిచిన అభ్యర్థులకు వెంటనే శాసనసభ్యులుగా ధ్రువపత్రాలు

ఖమ్మం, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఉభయ జిల్లాల అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఓట్ల లెక్కింపు వేర్వేరుగా జరగనుండటంతో ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు సమర్థవంతంగా చేశారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన ఓట్లను ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఇందుకోసం కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. నవంబర్ 30న పోలింగ్ పూర్తి కావడంతో డిసెంబర్ 1 ఉదయం నాటికి ఐదు నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను భారీ భద్రత మధ్య ఖమ్మంలోని ఓట్ల లెక్కింపు కేంద్రమైన చైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు తరలించి స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూంల వద్ద కలెక్టర్లు మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం 8 గంటలకు ప్రారంభం కానున్నది. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల ఆధారంగా ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేశారు.

**వీరికే అనుమతి..**

ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశీలకుడిని నియమించింది. ఆయా పరిశీలకులు ఇప్పటికే ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు ప్రతి నియోజకవర్గంలో 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ప్రతి రౌండ్‌లో ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను రిటర్నింగ్ అధికారి పరిశీలకులచే ధృవీకరించిన తర్వాత ఆ రౌండ్ ఫలితాన్ని వెల్లడిస్తారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లను, ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లతో పాటు వాటి పరిసరాలు క్షుణ్ణంగా కనిపించేవిధంగా సీసీ కెమెరాలను అమర్చి మానిటర్ల ద్వారా అధికారులు పర్యవేక్షణ జరుపుతున్నారు.

**కౌంటింగ్ కేంద్రాల పరిశీలన..**

లెక్కింపు కేంద్రాల వద్ద డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటలకు 144 సెక్షన్ అమలులో ఉన్నది. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ బృందంగా ఉంటారు. ఖమ్మం రూరల్ పరధిలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ పరిశీలించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ సందర్శించారు. అధికారులకు పలు సూచనలిచ్చారు. కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని విద్యుత్, తాగునీరు వంటి వాటికి ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల ఆధారంగా ఖమ్మం జిల్లాలో వైరా, భద్రాద్రి జిల్లాలో భద్రాచలం ఓట్ల లెక్కింపు త్వరితగతిన ముగిసే అవకాశం ఉంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు మొదట వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు నియోజకవర్గాల వారీగా పూర్తికాగానే మెజార్టీ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందినట్లుగా జిల్లా ఎన్నికల అధికారి ధ్రువపత్రం జారీచేస్తారు.

**ఖమ్మం జిల్లాలో లెక్కింపు ఇలా..**

ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 3,22,996 ఉండగా 2,30,724 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 355 పోలింగ్ బూత్‌లు ఉండగా 25 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనున్నది. పాలేరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,287 ఉండగా 2,14,810 ఓట్లు పోలయ్యాయి. 289 పోలింగ్ బూత్‌లు ఉండగా 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. మధిర నియోజకవర్గంలో మొత్తం 2,21,326 ఓటర్లు ఉండగా 1,94,615 ఓట్లు పోలయ్యాయి. 286 పోలింగ్ బూత్‌లు ఉండగా 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరడనున్నది. వైరా నియోజకవర్గంలో 1,93,069 ఓటర్లు ఉండగా 1,67,389 ఓట్లు పోలయ్యాయి. 252 పోలింగ్ బూత్‌లకు 18 రౌండ్లలో లెక్కింపు జరగనున్నది. సత్తుపల్లి నియోజకవర్గంలో 2,43,118 మంది ఓటర్లు ఉండగా 2,12,549 ఓట్లు పోలయ్యాయి. 292 పోలింగ్ బూత్‌లకు 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 12,16,796 ఓటర్లు ఉండగా 10,20,087 ఓట్లు పోలవ్వగా 1456 పోలింగ్ బూత్‌లకు 102 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది.


ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో ఓట్ల కౌంటింగ్‌కు బందోస్తు


పాల్వంచ అనుబోస్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**భద్రాద్రి జిల్లాలో లెక్కింపు ఇలా..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం నియోజకవర్గంలో 2,43,846 ఓటర్లు ఉండగా 1,86,347 ఓట్లు పోలయ్యాయి. 253 పోలింగ్ బూత్‌లకు 18 రౌండ్లలో లెక్కింపు ఉంటుంది. పినపాక నియోజకవర్గంలో 1,98,402 ఓటర్లు ఉండగా 1,58,978 ఓట్లు పోలయ్యాయి. 244 పోలింగ్ బూత్‌లకు 17 రౌండ్లలో లెక్కింపు ఉంటుంది. ఇల్లెందు నియోజకవర్గంలో 2,19,569 ఓటర్లు ఉండగా 1,76,840 ఓట్లు పోలయ్యాయి. 241 పోలింగ్ బూత్‌లకు 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. అశ్వారావుపేట నియోజకవర్గంలో 1,55,961 ఓటర్లు ఉండగా 1,35,501 ఓట్లు పోలయ్యాయి. 184 పోలింగ్ బూత్‌లకు 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. భద్రాచలం నియోజకవర్గంలో 1,48,661 ఓటర్లు ఉండగా 1,17,447 ఓట్లు పోలయ్యాయి. 176 పోలింగ్ బూత్‌లకు 12 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9,66,439 ఓటర్లు ఉండగా 7,75,113 ఓట్లు పోలయ్యాయి. 1,098 పోలింగ్ బూత్‌లకు 77 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది.


ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో ఓట్ల కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

# అమ్మో అనేలా ఎలక్షన్ బెట్టింగ్

- ఎన్నికల ఫలితాలపై ఎడతెగని ఉత్కంఠ
- అభ్యర్థుల గెలుపు, మెజార్టీపై రూ.లక్షల్లో పందేలు
- చేతులు మారనున్న రూ.కోట్లు
- ఆంధ్రా ప్రాంతాల్లోనూ భారీగా జూదం

ఖమ్మం, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొన్నది. పందెంరాయుళ్లు మాత్రం ఎన్నికల ఫలితాలనూ బెట్టింగ్‌కు వినియోగించుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారు.. ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది.. ఏ నియోజకవర్గంలో ప్రజల తీర్పు ఎలా ఉండబోతుంది.. అన్న అంశాలపై ఉభయ జిల్లాల పరిధిలో భారీగా బెట్టింగ్ జరుగుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయంపైనే ఎక్కువ మంది పందేలు కాస్తున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలైన జగ్గయ్యపేట, తిరువూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, గోపాలపురం వంటి ప్రాంతాల్లోనూ బెట్టింగ్ జరుగుతుండడం గమనార్హం. ఏలూరుకు చెందిన ఒక వ్యక్తి మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అవుతారని రూ.20 లక్షలు పందెం వేయగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు లభించే సీట్లలో కనీసం పది సీట్లు తేడా ఉంటుందని, బీఆర్ఎస్‌కే అధికంగా వస్తాయని కొందరు లక్షల్లో పందేలు కాశారు.

**పది నియోజకవర్గాల పరిధిలో..**

పార్టీల వారీగా ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? అన్న విషయమై రూ.కోట్లలో పందేలు జరుగుతున్నాయి. ఖమ్మం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విజయం సాధిస్తారని ఎక్కువ మంది కాన్ఫిడెంట్‌గా పందెం కాస్తున్నట్లు తెలుస్తున్నది. పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, మధిర అభ్యర్థి లింగాల కమల్‌రాజు, వైరా అభ్యర్థి మదన్‌లాల్, పినపాక అభ్యర్థి రేగా కాంతారావు, కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లెందు అభ్యర్థి హరిప్రియానాయక్ విజయంపైనా నియోజకవర్గాల్లో పందేలు నడుస్తున్నాయి.





**వేల నుంచి రూ.లక్షల వరకు పందేలు..**

ఒక్కో పందెం రూ.10 వేల నుంచి మొదలై రూ.50 లక్షల వరకు జరుగుతున్నట్లు సమాచారం. బీజేపీకి ఏడు సీట్లు దాటవని ఓ వ్యక్తి ఏకంగా రూ.10 లక్షలు పందెం కాయగా, జనసేనకు రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఓట్లపై మరో వ్యక్తి పందెం కాశాడు. కొత్తగూడెం నుంచి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన జలగం వెంకట్రావుకు ఎన్ని ఓట్లు వస్తాయన్న అంశంపై సత్తుపల్లి, కొత్తగూడెంలో జోరుగా పందేలు నడుస్తున్నాయి. పందెం డబ్బులను మధ్యవర్తి వద్ద పెట్టి నోటు రాయించుకోవడం గమనార్హం. సాధారణ కార్యకర్త నుంచి నాయకుల వరకు, వ్యాపారుల నుంచి ఉద్యోగుల వరకు.. ఎంతోమంది పందేలు కాస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారంటే.. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారని కూడా పందేలు జరుగుతున్నాయి. పెద్దమొత్తంలో పందెం కాసే వారు ఓటింగ్ సరళి, పోలింగ్‌శాతం, పోలైన ఓట్ల వంటి అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేసి మరీ పందెం కాస్తున్నారు.